యమపాశాలుగా విద్యుత్ లైన్లు

● పట్టించుకోని అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలంలోని పాంనూర్ గ్రామంలో వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ లైన్లు యమపాశాలుగా మారాయి. పలు చోట్ల విద్యుత్ పోల్‌లు వంగి ఉండటంతో పాటు లూజ్‌లైన్లు, వేలాడుతున్న విద్యుత్‌వైర్లతో రైతులకు అనునిత్యం తిప్పలు తప్పడం లేదు. గ్రామంలో గతంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లతో ప్రమాదాలు జరిగినా అధికారులు స్పందించడం లేదు. వ్యవసాయ భూముల వద్ద చేయి ఎత్తితే తాకేఅంతగా కిందికి విద్యుత్ లైన్లు ఉండటంతో రైతులు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని వ్యవసాయ పనులను చేస్తున్నారు. కోతల సమయంలో వరికోత మిషన్లు రావాలంటే జంకుతున్నారు. విద్యుత్ లైన్ల సమస్యపై గ్రామస్తులు, రైతులు పలుమార్లు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి వదిలేస్తున్నారు. దాంతో


వ్యవసాయ భూముల వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్‌తీగలు

పాంనూర్ గ్రామంలో విద్యుత్ లైన్ల సమస్య ఒక్క అడుగు ముందుకు, మూడు అడుగుల వెనుకకు అన్న చందాన మారింది. ఈ క్రమంలో శనివారం వ్యవసాయపొలంలో ఎల్‌టీ విద్యుత్ లైన్ తెగి పడి ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అన్నదాత తనువు చాలించాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి పాంనూర్‌లో నెలకొన్న విద్యుత్‌లైన్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

కొబ్బరికాయ @40

జనగామ: మనసారా మొక్కి.. దేవుడి చెంతన కొట్టే కొబ్బరికాయ కొనుగోలు భక్తులకు భారమవుతోంది. ఇటీవల రూ.15 నుంచి రూ.20 ఉన్న కొబ్బరి కాయ ధర ఒక్క సారిగా రూ.40 వరకు ఎగబాకింది. పూజలు, హోమాలు, వ్రతాలలో ఉపయోగించే ఈ పవిత్ర ఫలం ధరలు రెట్టింపు కావడంతో సామాన్యులు, మధ్య తరగతి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పండుగల సీజన్‌లో డిమాండ్, రవాణా వ్యయాలు పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో ఇవన్నీ కలిసి కొబ్బరికాయను పేదల చేతుల్లోంచి జారిపోయే స్థాయికి తీసుకెళ్లాయి. దేవుడికి మొక్కలు చెల్లించుకోవాలంటే ముందుగా ఖర్చు లెక్క పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పూజలో అవసరమయ్యే పదార్థాల్లో కొబ్బరికాయే ఇప్పుడు ఎక్కువ ఖర్చు అయ్యే వస్తువుగా మారిందని అంటున్నారు స్థానిక భక్తులు. ప్రభుత్వం కొబ్బరి కాయ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కొబ్బరి కాయలు

క్లుప్తంగా

అన్నదానం



జనగామ రూరల్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పానుగంటి ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా భార్య పానుగంటి సువార్త ఆదివారం పట్టనంలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలోని వృద్ధులు, బాలబాలికలకు అన్నదానం చేశారు.

రుద్రమదేవి వృద్ధాశ్రమంలో..



శామీర్‌పేట గ్రామ శివారులోని రుద్రమదేవి వృద్ధాశ్రమంలో జనగామకు చెందిన అర్జున్ శోభారాణి దంపతుల కుమార్తె దర్శిక పుట్టిన రోజు సందర్భంగా తాల్క లక్ష్మణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే దర్శిక అమ్మమ్మ తాతయ్య జ్ఞాపకార్థంగా ప్లేట్లు, పండ్లు వితరణ చేశారు. కాసం శెట్టి లవన్ కుమార్ జాపకార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నివాళి



జనగామ: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి తల్లి దొంతి కాంతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కాగా, ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హనమకొండలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. కాంతమ్మ చిత్ర పటానికి నివాళులర్పించి ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

14వ వార్డులో..

జనగామ పట్టణంలోని 14వ వార్డు బీఆర్‌ఎస్ యువ నాయకుడు, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ మహ్మద్ వసీం తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

చిల్పూరు: మండలంలోని తీగల తండాకు చెందిన బాదవత్ గణేష్‌కు విద్యుదాఘాతంతో తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది ఈఎంటీ రాజేంద్రప్రసాద్, పైలట్ రమేశ్ అందించిన వివరాలు.. తీగలతండాకు చెందిన గణేష్ ఆదివారం సాయంత్రం గిర్నితండా వద్ద వ్యవసాయ బావికి సంబంధించిన కనెక్షన్ గురించి విద్యుత్ పోల్ ఎక్కి సరి చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురవ్వడంతో తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రథమ చికిత్స అందిస్తూ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.


యువకుడికి చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

మురుగు నీటితో ఇబ్బందులు


అండర్‌బ్రిడ్జి కింద నిలిచిన మురుగు నీరు

జనగామ రూరల్: పట్టణంలోని రైల్వే బ్రిడ్జి కింద మురుగు నీరు, మట్టి కుప్పలు ఉండడంతో గిర్నిగడ్డ, కోర్టు, గీతానగర్, పోస్ట్ ఆఫీస్, బాణాపురం వెళ్లేవారికి ఇబ్బందిగా మారింది. మట్టి, మురుగు నీరు ఉండడంతో బ్రిడ్జి కిందినుంచి వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో ఈ దారి గుండా ప్రయాణించాలంటే ఇక్కట్లు తప్పడం లేదు. రైల్వే అధికారులు, జనగామ మున్సిపల్ కమిషన్ స్పందించి పట్టణ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా దారిని మరమ్మతు చేపట్టాలని న్యాయవాది జమాల్ షరీఫ్, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రజాపాలనలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పయనింపజేయడమే తన లక్ష్యమని, ఇందుకు ప్రతీ ఒక్కరు కలిసి వచ్చి అభివృద్ధికి చేయూతనివ్వాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. ఆదివారం కడగుట్టతండాకు చెందిన పలువురు గిరిజనులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, సునీల్‌రెడ్డి, భిక్షపతి, నాగరాజు, రవిందర్, యాకేష్‌యాదవ్, యాకూబ్, రాజు, నరేందర్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గిరిజనులు

సన్మానం


ఉదయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

రఘునాథపల్లి: ఫిర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన కొయ్యడ ఉదయ్‌కుమార్‌ను ఆదివారం వివిధ శాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. మండలంలోని నిడిగొండ గ్రామంలోని సీఎస్ఆర్ వెంచర్‌లోని స్వగృహంలో కరీంనగర్ ట్రాన్స్‌కో డీఈ కంచనపల్లి ఉపేందర్, ఎంజీఎం డాక్టర్ సిన్నపల్లి విజయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ కాత లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడబి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ మల్లేష్, రంగు శ్రీనివాస్, రాజు సందీప్‌రెడ్డిలు సన్మానించిన వారిలో ఉన్నారు.

సభను జయప్రదం చేయండి


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్మెట: తెలంగాణా గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఐదో మహా సభలను విజయవంతం చేయాలని సంఘం మండల గౌరవ అధ్యక్షుడు చిర్ర వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 14 ఏండ్లుగా న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించక పోవడం విచారకరమని అన్నారు. ఈసందర్భంగా మహబూబాబాద్ జిల్లా గార్లలో ఈనెల 24, 25 తేదీల్లో తలపెట్టిన మహాసభకు పంచాయతీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి మారోజు రామచంద్రం, జిల్లా సభ్యుడు వేల్పు అంజనేయులు, మండల కార్యదర్శి గోల్కొండ అంజయ్య, సభ్యులు పండ్ల యాదగిరి, కుంటి యాదమ్మ, కుంటి బారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పరిశీలకులను కలిసిన నాయకులు


కాంగ్రెస్ పరిశీలకులతో మండల నాయకులు

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఎన్నిక పరిశీలన కోసం వచ్చిన ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్, ఎమ్మెల్యే శంకర్ తదితరులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు లకావత్ లక్ష్మీనారాయణనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, జిల్లా కార్యదర్శి తోటకూరి పాండు కృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సజ్జన్ నాయక్, యాకస్వామి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రంక్ పెట్టెల పంపిణీ

పాలకుర్తి టౌన్: జేఎస్‌టీయూ సహకారంతో మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయ విద్యార్థులకు 250 ట్రంక్ పెట్టెలను మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఫౌండర్ గంటా రవీందర్ ఆధ్వర్యంలో ఆదివాంర విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కల్నల్ భిక్షపతి, దోపతి రాం రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


ట్రంక్ పెట్టెలను అందజేస్తున్న రవీందర్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: మహబూబాబాద్ జిల్లా గార్లలో ఈనెల 24, 25 తేదీల్లో జరగనున్న తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల వెంకన్న, నారోజు రామచంద్రం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి రెండో పీఆర్సీ పరిధిలోకి పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గుంత పూడ్చివేత



బచ్చన్నపేట: తమ్మడపల్లి గ్రామం నుంచి పోచన్నపేట గ్రామానికి వెళ్లే రోడ్డుకు అడ్డంగా పెద్ద గుంత ఏర్పడింది. ఆ గుంతను తమ్మడపల్లికి చెందిన గ్రామస్తుడు సానికె రాజు సొంత డబ్బులతో ఆదివారం పూడ్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల నుంచి వచ్చిన నీటితో రోడ్డుకు అడ్డుగా పెద్ద గుంత ఏర్పడంతో ఆ దారిలో వెళ్లడం కష్టమైందన్నారు. దీంతో ట్రాక్టర్లతో మట్టిని తెప్పించి గుంత పూడ్చామన్నారు. కాగా, గుంతను పూడ్చిన రాజును ప్రజలు అభినందించారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే ప్రమాదాలు


రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

బచ్చన్నపేట: రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు ఏదో ఒక చోట రోడ్డుపై ధాన్యం కుప్పలను తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆరబోసిన ధాన్యం కుప్పలపై నల్లటి పరదాలు కప్పుతుండడంతో రాత్రి వేళ కనిపించక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ధాన్యం కుప్పలను తప్పించబోయి నారాయణపురం గ్రామంలో ఒకరు, పోచన్నపేట శివారు కాశీనగర్ వద్ద ఒకరు మృతి చెందారు. రోడ్లపై రైతులు ధాన్యం కుప్పలను ఆరబోయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

‘పేదలకు ఇళ్లు ఇవ్వకపోవడం సరికాదు’

తొర్రూరు: పేదలకు ఇళ్లు అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్ అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిరసన కార్యక్రమాలు ఆదివారం కొనసాగాయి. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కొమ్మన బోయిన యాకయ్య, పార్టీ నాయకులు డొనుక దర్గయ్య, జమ్ముల శ్రీనివాస్, మార్క సాంబయ్య, స్థానికులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలి

చిల్పూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వల్లగుట్ట గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. హైకోర్టు స్టేతో కాంగ్రెస్ డ్రామా బట్టబయలయిందని అన్నారు. బీసీలంతా ఏకమై ఉద్యమం చేపట్టల్సిన అవసరం ఉందన్నారు.

జఫర్‌గఢ్: 42 శాతం బీసీ రిజర్వేషన్ల ద్వారానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు తౌటి సురేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎన్నికలు నిలిచిపోయాయన్నారు. బీసీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి అబ్బరబోయిన యాకస్వామి, మేర్గు రామరాజు, దుద్దుల చంద్రమౌళి, ముస్కు నర్సిరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

‘బీసీలను మోసగిస్తున్న పార్టీలు’

తొర్రూరు: బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పించకుండా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు నాటకాలాడుతున్నాయన్నారు. కోర్టు తీర్పు అనంతరం ఆ పార్టీలు నెపం ఇతరులపై మోపుతూ బీసీ ప్రజలను వంచిస్తున్నారన్నారు. రాజ్యాంగ సవరణ లేకుండా 42 శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారనే విషయంలో నిజాలు చెప్పకుండా ప్రధాన పార్టీలు మోసగించాయన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఈజీఎస్ సర్వేలు


సర్వే చేస్తున్న డీఆర్‌పీలు

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్వహించిన పనులపై వీఎస్ఎల్, డీఆర్‌పీలు సర్వేలను చేస్తున్నట్లు ఏపీఓ కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై కూలీల వారీగా సర్వేలను చేస్తున్నట్లు తెలిపారు. సర్వే బృంద సభ్యులు నేరుగా మస్టర్‌లో ఉన్న సభ్యులను కలిసి వారి చేసిన పనిదినాలు, వచ్చిన కూలి వివరాలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అనంతరం గ్రామంలో గ్రామ సభను నిర్వహించి గ్రామస్తుల సమక్షంలో పనుల వివరాలను వివరిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలు పూర్తి అయిన తర్వాత సామాజిక తనిఖీ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు, వీఎస్ఎల్‌లు, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

బచ్చన్నపేట: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఆదివారం సెలవు దినం అయినా కూడా నిర్వహిస్తూ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. అధికారుల పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎద్దు అరవింద్, కాసర్ల సాయి, కమల్, ప్రదీప్, శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మురళీకృష్ణ

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని సయ్యద్‌హుస్సేన్‌పల్లికి చెందిన చిన్నారి నిహాన్సిక వేడి నీరు మీద పడడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, ఆదివారం చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు రూ.5వేల సాయం పంపించగా కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అందజేశారు. నాయకులు చిర్ర నాగరాజు, రత్నాకర్ రెడ్డి, దార రాజు, నరసింహారెడ్డి, జీడీ ఆనందం, డాక్టర్ పేరాల సుదాకర్, కుంచాల రాజు, బత్తిని రాజు, జయప్రకాష్, అశోక్‌పాల్, ఇసురం కృష్ణ తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బస్‌స్టేజీ కాలనీకి చెందిన పోతరాజు దానయ్య మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల నాయకుడు ఏల సుందర్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దానయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జోగు సోమనరసయ్య, మాజీ సర్పంచ్ చింత యాదగిరి, భాషిపాక అబ్బయ్య, ఐలుమలు, రామచంద్రు, సుధాకర్, నవీన్, ఇస్తారి, సోమనరసయ్య, సోమయ్య , మహేష్, ఎల్లేష్ ,ఉప్పుల పరుశురాములు ఉన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ ఎన్నిక

పాలకుర్తి: మండల కేంద్రంలో జిల్లా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అన్‌మాన్ కార్మికులు సాధనకు ఆదివారం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మిట్టపల్లి ఆనంద్, కార్యదర్శిగా బోయిన భాస్కర్ ఎన్నికయ్యారు. ఎన్నిక కార్యక్రమానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో కమలాకర్, లక్ష్మణ్, చంద్రమౌళి, పర్శరాములు, సోమన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

రామన్నపేట : ఆర్యవైశ్యులంతా రాజకీయంగా ఎదగాలని, ఐకమత్యంతో ఉండి మన హక్కులకై పోరాటం చేయాలని ఆర్యవైశ్య పోరాట సమితి(ఏపీపీఎస్) జాతీయ నాయకుడు ప్రేమ్ గాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్యవైశ్యపోరాట సమితి జిల్లా సభ్యుల ప్రమాణస్వీకారం మహోత్సవం వరంగల్ ఏవీవీ విద్యాసంస్థలో ఘనంగా నిర్వహించారు. వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రేమ్‌గాంధీ మాట్లాడుతూ వైశ్యకులస్తుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శిగా దారారపు సంతోష్, కోశాధికారిగా నాగమల్ల సతీష్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఏవీవీ విద్యాసంస్థలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో 24 మంది కార్యవర్గ సభ్యులతో పాటు శ్యాంప్రసాద్, కళా రాజేశ్వర్‌రావు, వైశ్యప్రముఖులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌గాంధీ

జనగాం బ్రాయిలర్ చికెన్ రేట్లు

హోల్‌సేల్ రేటు	- 111/-
రిటైల్ లైవ్	- 134/-
విత్ స్కిన్	- 198/-
స్కిన్ లెస్	- 220/-

గాజా పునర్నిర్మాణానికి పాటుపడాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

న్యూశాయంపేట : గాజా పునర్నిర్మాణానికి ప్రపంచ దేశాలు సాయం అందించి ఆదుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ ఇస్లామిక్ సెంటర్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో గాజా జీనోసైడ్-పునర్నిర్మాణం అనే అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు ప్రసంగించారు. జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ సోయబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఇజ్రాయిల్ దాడుల కారణంగా 67వేల మంది అమాయక మహిళలు, చిన్నారులు మరణించారని లక్షల మంది గాయపడ్డారన్నారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. ఇజ్రాయిల్ హమాస్ యుద్ధం ప్రపంచంలోనే అత్యంత వినాశకర ప్రాంతాల్లో ఒకటిగా మార్చిందన్నారు. మానవత దృక్పదంతో పాలస్తీనా గాజాలో తిరిగి పౌరులు సాధారణ జీవితం కొనసాగేలా అంతర్జాతీయ సంస్థలు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.